క్లుప్తంగా

పోలీస్ సిబ్బందికి కంటి పరీక్షలు



పోలీస్‌కు కంటి పరీక్ష చేస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణుల బృందం ఆధ్వర్యంలో ఏలూరు అమీనాపేటలోని పోలీస్ కల్యాణ మండపంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందికి ఉచిత కంటి పరీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ప్రారంభించారు. తొలుత ఆయన కంటి పరీక్ష చేయించుకున్నారు. పోలీస్ శాఖలోని సిబ్బందికి ఉచితంగా చికిత్సలు చేయటం అభినందనీయమని ఆయన అన్నారు. పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఫీజులను నియంత్రించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ జీవన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల, కళాశాల పేరుతో ముద్రించిన పుస్తకాలకు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. డీఈఓ, ఆర్ఐఓ స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల, కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో పీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అధ్యాపకులలో పరిశోధన నైపుణ్యాలను పెంపొందించడం కోసం ఎన్‌హాన్సింగ్ రీసెర్చ్ స్కిల్స్ – ఏ వర్క్‌షాప్ ఆన్ మెథడాలజీ అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని సీఆర్ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెల్, ఐక్యూఏసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు అధ్యక్షత వహించగా, కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ విశిష్ట అతిథిగా విచ్చేశారు. రిసోర్స్ పర్సన్‌గా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ పి.బ్రహ్మాజీరావు, కరీంనగర్ వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ ఇ.హరిప్రసాద్, రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ఎస్ ఉదయ్ భాస్కర్ వ్యవహరించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు, సీఆర్ఆర్ కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు

ఏలూరు (టూటౌన్): ఏపీ మిడ్ లెవెల్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ సిబ్బందికి ఏఐటీయూసీ నాయకత్వం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ వీధిన పడటానికి రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరే కారణమని అన్నారు. ఆరేళ్ల సర్వీస్ పూర్తయిన వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆర్ శ్రీనివాస్ గాంగే, కార్యదర్శి కె.బుచ్చిబాబు, జిల్లా నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. మద్దతు తెలిపిన వారిలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.విగ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి కె.క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కెనాల్‌లో దుర్గంధం

- గుర్రపు డెక్క, చెత్తా చెదారంతో నిండిన వైనం
- ఏలూరుకు తాగునీటి సరఫరాకు ఇదే దిక్కు
- కెనాల్ ప్రక్షాళనకు చర్యలు శూన్యం



మినీబైపాస్ రోడ్డులో కృష్ణా కెనాల్‌లో అల్లుకుపోయిన గుర్రపు డెక్క

ఏలూరు టౌన్: ఏలూరు నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఏడు పంచాయతీలు విలీనమయ్యాయి. ప్రస్తుతం ఏలూరు నియోజకవర్గం జనాభా సుమారు రూ.3.25 లక్షలకు చేరింది. ప్రజలకు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు పంపుల చెరువులో నీటిని నింపాల్సి ఉంది. పంపుల చెరువుకు నీటిని సరఫరా చేసే కృష్ణా కాలువ పూర్తిగా చెత్తాచెదారం, గుర్రపుడెక్క, నాచుతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో వేసవి కాలంలో ఏలూరు నగరవాసులు ఈ ఏడాది తాగునీటికి ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. స్వచ్ఛత పేరుతో తూతూ మంత్రంగా అధికారులు ఫొటోలకు ఫోజులివ్వడం మినహా కృష్ణకెనాల్ శుభ్రతకు చర్యలు చేపట్టే పరిస్థితి లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే ప్రక్షాళన

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఏలూరు నగరం మధ్యలో ఉన్న కృష్ణా కెనాల్‌ను పూర్తిస్థాయి ప్రక్షాళనకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. తూర్పులాకుల వద్ద నుంచీ మినీబైపాస్ చివరి వరకు కెనాల్‌ను వారం రోజుల పాటు ప్రక్షాళన చేసింది. కాలువలో చెత్తా, వ్యర్థాలు, గుర్రపు డెక్క, నాచును తొలగించటంతోపాటు, కాలువలో పూడికలు తీసి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేసింది. నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్ తోపాటు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో అప్పట్లో కాలువను పరిశుభ్రం చేయించారు.



పడమటి లాకుల సమీపంలో కెనాల్‌లో అల్లుకుపోయిన గుర్రపుడెక్క



జూట్‌మిల్లు సెంటర్ సమీపంలో కెనాల్‌లో దర్శనమిస్తున్న వ్యర్థాలు

తీవ్ర దుర్గంధం

ఏలూరు నగరాన్ని వన్, టూటౌన్‌గా విభజిస్తూ, నగర ప్రజలకు తాగునీటి సరఫరాకు కృష్ణా కాలువ మధ్యలో ఉంటుంది. కాలువ గట్లపై చెట్లుతో ఆహ్లాదకరంగా ఉండాల్సింది పోయి, చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపుడెక్క, తూడు, నాచుతో నిండిపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. పలుచోట్ల వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కాలువలో దుకాణాల వ్యర్థాలు, చెత్త, చెదారం వేయటంతో నీరు కలుషితమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. నగర ప్రజలకు స్వచ్ఛమైన నీటిని పంపుల చెరువులకు తరలించే పరిస్థితి లేకుండా పోయింది. ఏలూరు నగరంలోని సుమారు 78 వేల ఇళ్లు, విలీన గ్రామాల్లోని సుమారు 35 వేల ఇళ్లకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు కృష్ణా కాలువను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు. వేసవి కాలం కావటంతో కాలువలో పూడిక తీయించి నీటి సరఫరాకు ఇబ్బందిలేకుండా చూడాలని ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

కాలువను శుభ్రం చేయాలి



ఏలూరు నగరం, నగరపాలక సంస్థ విలీన గ్రామాల్లోనూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. తాగునీటిని పంపుల చెరువుకు సరఫరా చేసేందుకు వినియోగించే కృష్ణా కాలువను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వ హయాంలో కాలువను పరిశుభ్రతకు యంత్రాంగం చర్యలు తీసుకుంది.

– జిజ్జువరపు విజయనిర్మల, వైఎస్సార్ సీపీ ఏలూరు నగర మహిళా అధ్యక్షురాలు

స్వచ్ఛమైన వాతావరణం కోసం



ఏలూరు నగరం మధ్య నుంచి ప్రవహించే కృష్ణా కాలువను శుభ్రం చేయటంతోపాటు, గట్టుపై చెట్లు పెంచుతూ, వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలి. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతారణాన్ని కల్పించాలి. జిల్లా అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపడితే ప్రజలు సంతోషిస్తారు.

– నెరుసు చిరంజీవి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు

నీతి కథలను పఠించిన విద్యార్థులు



పెయింటింగ్ వేసి ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నీతి కథలను పఠిస్తే మనిషిలో నిద్రాణమై ఉన్న మానవీయ కోణాన్ని తట్టిలేపుతాయని ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రాంభించారు. తొలుత విద్యార్థులతో కథలు చదివించి, కథల్లోని నీతిని వారికి వివరించారు. రిసోర్స్ పర్సన్ ఒ.తరుణ్ కుమార్ విద్యార్థులకు గణితంలో ప్రాథమిక మెళకువలను నేర్పించారు. డి.శ్రీవల్లి రకరకాల పెయింటింగ్ చిత్రాలు వేయడంలో శిక్షణ ఇచ్చారు. పి.శంకర్ డ్రాయింగ్ శిక్షణ కొనసాగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాంపాషా, బీవీఎస్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఓ 77ను రద్దు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 77ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) ఏలూరు జిల్లా అధ్యక్షుడు జి.రోహిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ జీఓ ప్రభుత్వ ఉద్యోగుల ప్రాథమిక హక్కులను కాలరాసే విధంగా ఉందని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఉద్యోగులపై నియంత్రణ విధించడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, ఇదే ధోరణి కొనసాగితే, విద్యార్థులందరం ఉద్యోగులతో కలిసి ఉద్యమంలోకి దిగతామని హెచ్చరించారు.

హెల్మెట్ ఉంటేనే లోనికి వెళ్లండి!



కేంద్ర గ్రంథాలయంలో పెచ్చులూడిన పైకప్పు



విరిగిన గ్రంథాలయం సన్‌సైడ్



గ్రంథాలయం ప్రధాన ద్వారం వద్ద నోటీసులు



గ్రంథాలయంలో ఊడిపోయిన సీలింగ్



పాఠకులు కూర్చునే ప్రాంతంలో పెచ్చులూడిన గోడ

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విచిత్ర పరిస్థితి
- శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడు లేడు
- ఆధునికీకరణ ప్రతిపాదనలు బుట్టదాఖలు
- నగరపాలక సంస్థ నుంచి జమకాని సెస్ బకాయిలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పోలీసు, రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తూ ఉండడం చూస్తుంటాం. కానీ ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలోనికి అడుగుపెట్టే ముందే అధికారులు గోడకు అతికించిన నో హెల్మెట్, నో ఎంట్రీతో పాటు భవనం శిథిలావస్థలో ఉందని, పాఠకులు జాగ్రత్తగా ఉండాలనే నోటీసులు దర్శనమిస్తూ విస్తుగొలిపిస్తున్నాయి. వాస్తవానికి జిల్లా రవాణా ఉప కమిషనర్ ఆదేశాల మేరకు ఇలా అతికించినా గ్రంథాలయంలోనికి వెళ్లిన పాఠకులకు మాత్రం దానిలోని అంతరార్థం అర్థంకాదు. ఎందు కంటే ఈ గ్రంథాలయంలో పెచ్చులూడిన సీలింగ్, చెమ్మదేరిన గోడలు ఎప్పుడైనా కూలి మీదపడతాయనే భయం కలిగిస్తాయి. ఒకప్పుడు జిల్లాకే తలమానికంగా ఉన్న నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం శిథిల దశకు చేరడంతో పాఠకులు ప్రాణభయంతో చదవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

80వ దశకంలో నిర్మాణం

గ్రంథాలయ భవనం 30 ఏళ్లలోపే శిథిల దశకు చేరిందని సీనియర్ పాఠకులు చెబుతున్నారు. గ్రంథాలయంలో ఎక్కడ చూసినా పెచ్చులూడిన పైకప్పు, గోడలు దర్శనమిస్తున్నాయి. గతంలో పై అంతస్తును పూర్తిగా మూసి వేసి రిఫరెన్స్ విభాగాన్ని కిందికి మార్చారు. దీంతో కింది భాగంలో పాఠకులు కూర్చోవడానికి కూడా స్థలం లేక అగచాట్లు పడుతున్నారు. కింది భవనంలో సైతం గోడలకు పెచ్చులూడడం ప్రారంభమైంది. ఒకప్పుడు రోజుకు కనీసం 500 మంది పాఠకులు వచ్చే ఈ గ్రంథాలయానికి ప్రస్తుతం రోజుకు 300 నుంచి 350కి మించి పాఠకులు రావడంలేదు.

ఆధునికీకరణకు లభించని అనుమతులు

2010 తరువాత గ్రంథాలయ పాలక మండలి ప్రతినిధులు నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతునే ఉన్నారు. అయితే గ్రంథాలయ పరిషత్ నుంచి అనుమతులు లభించలేదు. జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఇటీవల నిర్వహించిన గ్రంథాలయ సంస్థ సమావేశంలో భవన ఆధునికీకరణకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపడానికి అనుమతులిచ్చారు. గ్రంథాలయ సంస్థ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా స్పందన లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు గ్రంథాలయ సంస్థకు చైర్మన్‌ను నియమించకపోవడాన్ని పాఠకులు తప్పుపడుతున్నారు. చైర్మన్‌ను నియమిస్తే పై స్థాయిలో చర్చించి ఆధునికీకరణకు అనుమతులు తీసుకొచ్చే అవకాశం ఉండేదంటున్నారు.

రూ.18 కోట్ల బకాయిలు

గ్రంథాలయ భవనం ఆధునికీకరణకు అనుమతులు లభించినా ప్రస్తుతం పరిస్థితుల్లో పనులు చేపట్టే అవకాశం లేదు. దీనికి నిధుల లేమే కారణం. జిల్లా గ్రంథాలయ సంస్థకు వివిధ స్థానిక సంస్థల నుంచి రూ.18 కోట్ల సెస్ బకాయిలు జమకావాల్సి ఉంది. స్థానిక సంస్థలు వసూలు చేసే ఇంటి పన్నులో 8 శాతం గ్రంథాలయ పన్నులే. కానీ గ్రంథాలయ సంస్థకు సెస్ చెల్లించడంలేదు. జిల్లా గ్రంథాలయ సంస్థకు అతి పెద్ద బకాయిదారు ఏలూరు నగరపాలక సంస్థే. నగరపాలక సంస్థ గ్రంథాలయ సంస్థకు రూ.11 కోట్ల సెస్ బకాయిలు పెట్టింది.

నిర్లక్ష్య వైఖరి



పిల్లర్స్ లేకుండా కట్టిన జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. దీన్ని కూల్చివేయాలని గతంలోనే ఇంజినీర్లు సర్టిఫికెట్లు ఇచ్చిన విషయాన్ని ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా నిర్లక్ష్య వైఖరిని వీడడంలేదు. ప్రమాదం జరగకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నూతన గ్రంథాలయ భవనం నిర్మించాలి.

– శ్రీ నాగాస్త్ర, జిల్లా కన్వీనర్, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక

స్పందించని కమిషనర్



ఏలూరు నగరపాలక సంస్థ గ్రంథాలయ సంస్థకు రూ.11 కోట్ల సెస్సు బకాయి చెల్లించాలని నగర కమిషనర్‌కు ఎన్నిసార్లు కలిసినా స్పందించడం లేదు. గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ సెస్ బకాయిలు విడుదల చేయాలని కమిషనర్‌కు ఆదేశాలిచ్చినా పట్టించుకోలేదు. ఇతర స్థానిక సంస్థలు అరకొరగా జమ చేస్తున్న సెస్ బకాయిలు గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు జీతభత్యాలకే సరిపోతోంది. – ఎం. శేఖర్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

11న ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యారంగంలో రాణిస్తున్న ఆర్యవైశ్య విద్యార్థులను ప్రోత్సహించేందుకు వారికి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయనున్నట్టు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి సత్రం అధ్యక్షుడు దివ్వెల జయ ప్రకాష్ (జయబాబు) తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి సత్రంలో ఆయన మాట్లాడుతూ 10వ తరగతి స్టేట్, సీబీఎస్ఈ సిలబస్‌లలో చదివిన విద్యార్థులకు, ఇంటర్మీడియట్, డిగ్రీ తదితర విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి పూర రామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 11న స్థానిక కన్యకాపరమేశ్వరి సత్రంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున ఈ స్కాలర్‌షిప్‌లు, 5, 6, 7 తరగతుల విద్యార్థులకు 100 మందికి స్కూల్ బ్యాగులు, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉపయోగపడే 1000 నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆర్యవైశ్య నాయకుడు మద్దుల సత్యకుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఈ స్కాలర్‌షిప్‌లను ఆర్యవైశ్య విద్యార్థులతోపాటు అన్ని సామాజికవర్గాల విద్యార్థులకు అందించనున్నట్టు చెప్పారు. సమావేశంలో కన్యకాపరమేశ్వరి సత్రం కోశాధికారి దేసు నరసింహారావు, నాయకులు పచ్చిపులుసు సుజన్, తమ్మన రాంబాబు, మోతే వెంటక చలపతి రావు, మాటూరి మధుసూధన్ రావు, వేమా కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



బ్యాగ్‌లు, పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

ఫ్లెక్సీ కడుతున్న ఖాకీలు



ఖాకీల పరిస్థితి దయనీయంగా మారింది. మంగళవారం ఉదయం ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రత సమావేశం నిర్వహించారు. దీనికి మంత్రి పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌తో పాటు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. హడావుడిగా కలెక్టరేట్ వద్ద ఫ్లెక్సీ కడుతూ ఖాకీలు కనిపించడం చర్చనీయాంశమైంది. – సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

విద్యతోనే వ్యక్తిగత, సమాజాభివృద్ధి

ఏలూరు (టూటౌన్): బాలలకు ఉన్నత చదువులు చదివించడం వల్ల వ్యక్తిగత, సమాజాభివృద్ధి జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాదు అన్నారు. పెదపాడు మండలం కొత్తూరులో అసంఘటిత కార్మికులకు మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలలు ఉన్నత విద్యను అభ్యసించే విధంగా చిన్ననాటి నుండే ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో ఆర్థికంగా వెనకబడిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. ప్రతి కార్మికుడూ తమ వివరాలను ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి పొందటం సులభతరం అవుతుందని తెలిపారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సాయంపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు పి.రత్నరాజు, డీసీపీఓ సూర్య చక్రవేణి, అసిస్టెంటు పీఓ పి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు – తిరుపతి	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	14
ఏలూరు –జీడీమెట్ల (ఖమ్మం)	20.15	4802	24
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	22
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు – తిరుపతి	16.00	4830	29

ధాన్యం మొత్తం కొనాలి

ఏలూరు (టూటౌన్): రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శివర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళశారం వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఏలూరు జిల్లాలో దాదాపుగా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయిందని ప్రభుత్వమే చెబుతూ, 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు లక్ష్యం నిర్ణయించడం అన్యాయమని అన్నారు. లారీల ఏర్పాటు, సంచులను ఇవ్వడంలో తాత్సారం చేయడం వల్లే ఇటీవల కురిసిన వర్షాలకు పంట తడిచి రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున రైతులు ఆందోళన చేస్తారని వారు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక విద్యానగర్ ఫీడర్‌కు వార్షిక మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా నగర్, ఫిరంగుల దిబ్బ, ఆదర్శనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

వాసవీ మాత ఊరేగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి సత్రం ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కన్యలు, మహిళలు వాసవీ మాతకు జైజైలు పలికారు. అమ్మవారి ఊరేగింపు స్థానిక సత్రం నుంచి గజ్జల వారి చెరువు వరకు నిర్వహించారు. రాత్రి చెరువులో అమ్మవారి తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్రం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దివ్వెల జయప్రకాష్, పూర రామకృష్ణారావు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

కిషోర బాలికలకు అవగాహన

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని ఫస్ట్ సెక్టార్ యాదవ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలిక వికాస కార్యక్రమంలో భాగంగా రుతుక్రమము, పరిశుభ్రత, లైంగిక విద్యపై సీడీపీఓ విజయలక్ష్మి అవగాహన కల్పించారు. కబాడీగూడెం టు ఏ కేజీ సెంటర్ ఆదివారంపేట పరిధిలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు.